## క్లుప్తంగా

### పాలవాయిలో తాగునీటి ఎద్దడి



పంట పొలాల్లో నుంచి నీరు తీసుకెళ్తున్న మహిళలు

**కళ్యాణదుర్గం రూరల్:** కూటమి ప్రభుత్వం అధికారం చేపటినపట్టి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కష్టాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని పాలవాయి గ్రామంలో మారంపల్లి కాలనీవాసులు పదిరోజులుగా తాగునీరు లేక అవస్థలు పడుతున్నారు. పాలవాయి గ్రామ మహిళలు మాట్లాడుతూ నీటి సమస్యపై గ్రామంలోని సచివాలయ సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోలేదన్నారు.

### 15లోపు గోకులం షెడ్లు నిర్మించుకోవాలి



గోకులం షెడ్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీం బాషా

**కూడేరు:** గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా చేపడుతున్న మినీ గోకులం షెడ్ల నిర్మాణాలు ఈ నెల 15లోపు పూర్తి చేయించాలని డ్వామా పీడీ సలీం బాషా ఆదేశించారు. శనివారం ఆయన జల్లిపల్లి, కొర్రకోడు, ఉదిరిపికొండ గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న మినీ గోకులం షెడ్ల నిర్మాణాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మండలంలో మొత్తం 32 మినీగోకుల షెడ్లు మంజూరు కాగా, అందులో 6 పూర్తి కాగా 11 రూఫ్‌లెవల్, 10 పిల్లర్ లెవల్, 6 పునాది లెవల్‌లో ఉన్నట్లు ఏపీఓ ఆయనకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఓ తులసీ ప్రసాద్, బీఎఫ్‌టీ జనార్దన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### దాతల కృషి అభినందనీయం



నూతన ఆడిటోరియంలో కళాశాల విద్యార్థులు

**రాయదుర్గంటౌన్:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆడిటోరియం నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు, దాతలు, అధ్యాపకుల కృషితో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాదాపు రూ.18 లక్షలతో నిర్మించిన ఆడిటోరియాన్ని శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్ గౌని లావణ్య, సీనియర్ న్యాయవాది అనంత రామచార్యులు, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, తెలుగు అధ్యాపకుడు వీరేష్ హాజరుగా ఆడిటోరియాన్ని అందుబాటులోకి తెచ్చారు. పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు రాణించి జీవితంలో ఉన్నత స్థాయిలో నిలువాలని ఆకాంక్షించారు.

### ఉరవకొండకు చేరిన సిద్ధ అవధూతల జ్యోతి రథయాత్ర



ఉరవకొండలో గవిమఠం ఉత్తరాధికారి ఆశీస్సులు పొందుతున్న భక్తులు

**ఉరవకొండ:** కర్ణాటకలోని హుబ్లిలో వెలసిన సిద్ధ అవధూతల స్వామి పీఠం నుంచి వంద మంది భక్తులు చేపట్టిన జ్యోతి రథయాత్ర శనివారం ఉరవకొండకు చేరింది. ప్రసిద్ధిగాంచిన గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామిని సత్కరించి, వారి ఆశీస్సులు పొందారు. ఫిబ్రవరి 20న హుబ్లిలో జరిగే సిద్ధ అవధూతల ఆరాధనోత్సవానికి ఉత్తరాధికారికి ఆహ్వానం అందించారు.

### రైతులకు మేలు చేయడానికే రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న తహసీల్దార్ నయాజ్ అహమ్మద్

**వజ్రకరూరు:** రైతులకు మేలు చేకూర్చేందుకే రెవన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నయాజ్ అహమ్మద్ తెలిపారు. శనివారం మండలంలోని పొట్టిపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచు సురేంద్ర, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కేశవరెడ్డి, మండల సర్వేయర్ మంజుల, ఆర్ఐ అశ్వర్థనారాయణ, వీఆర్వో ఈశ్వర్, ఎండోమెంట్ అధికారి రాణి పాల్గొన్నారు.

# లక్ష్యంపై నిర్లక్ష్యం

**దుర్గం మున్సిపాలిటీలో పేరుకుపోయిన పన్ను బకాయి**

- రూ.9.07 కోట్ల లక్ష్యానికి రూ.3.35 కోట్లు వసూలు
- అధిక శాతం నీటి, ప్రభుత్వ శాఖల పన్ను బకాయిలు



రాయదుర్గం పురపాలక సంఘం

**రాయదుర్గంటౌన్:** ఆదాయం ఎక్కడుంటే అభివృద్ధి అక్కడుంటుంది.. అయితే ప్రధానంగా మున్సిపాలిటీ అభివృద్ధికి ఆదాయ వనరులు బాగుండాలి. అందులో ముఖ్యంగా ఆస్తి, నీటి పన్నులతోపాటు ట్రేడ్ లైసెన్సుల ద్వారా వచ్చే ఫీజులు వసూలు కావాలి. పురపాలక సంఘంలో పన్ను వసూళ్లు నత్తనడకన సాగుతున్నాయి. లక్ష్యం మేరకు పన్ను వసూలు కాకపోవడంతో అభివృద్ధికి ఆటంకం కలుగుతోంది. క్షేత్రస్థాయిలో సిబ్బంది పన్ను వసూళ్లపై చొరవ చూపలేదన్న విమర్శలు ఉన్నాయి.

రాయదుర్గం పురపాలక సంఘంలో పన్ను వసూళ్లు నత్తనడకన సాగుతోంది. జనవరి మొదటి వారం గడిచిపోతున్నా కనీసం 50 శాతానికి కూడా చేరుకోలేదు. ధరల పెరుగుదల, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాదిరిగా కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో ఏమాత్రం లబ్ధి చేకూరకపోవడం ఒక కారణం. మరోవైపు ఆశించిన మేర పంటల దిగుబడి రాలేదు. దీంతోపాటు మార్కెట్ డీలా పడి వ్యాపారాలు అంతంతమాత్రమే అవుతున్నాయి. దీంతో ఆర్థిక లావాదేవీలు సన్నగిల్లాయి. వీటన్నింటి ప్రభావం పేద, సామాన్య, బడుగు, బలహీన వర్గాలపై పడుతోంది. క్షేత్ర స్థాయిలో మున్సిపల్ సిబ్బంది పన్నుల వసూళ్లకు వెళ్లినప్పుడు పన్ను చెల్లింపులో ఆర్థిక ఇబ్బందులపై ప్రజలు కాస్త సమయం కోరుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాక 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్చి నెలాఖరు వరకు గడువు ఉంటుందని, అప్పటిలోపు చెల్లిస్తామని బకాయిదారులు మున్సిపల్ సిబ్బందితో వేడుకుంటున్న పరిస్థితి.

**ప్రభుత్వ శాఖలపై ప్రేమ కురిపిస్తున్న అధికారులు..**

సామాన్యులను ముక్కుపిండి పన్ను వసూలు చేసే మున్సిపల్ అధికారులు ప్రభుత్వశాఖలపై మాత్రం ఎనలేని ప్రేమ కురిపిస్తున్నారు. కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్ప చిత్తశుద్ధితో వసూలు చేయలేదన్న విమర్శలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వశాఖల భవనాలకు సంబంధించి 105 అసెస్‌మెంట్లు, కేంద్ర ప్రభుత్వ భవనాలకు సంబంధించిన 40 ఆస్తి పన్ను అసెస్‌మెంట్లు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ భవనాల డిమాండ్ రూ.2.51 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి దాకా కేవలం రూ.1.01 లక్షలు మాత్రమే వసూలు చేశారు. కేంద్ర ప్రభుత్వ భవనాల ద్వారా రూ.36 లక్షల ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉండగా కేవలం రూ.10,888 మాత్రమే అయ్యింది. పన్ను వసూళ్లతోనే మున్సిపాల్టీలో అభివృద్ధి పనులు, కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు చెల్లింపు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు ఆధారపడి ఉన్నాయి.

### రూ.3.35 కోట్లు మాత్రమే వసూలు ...



క్షేత్ర స్థాయిలో పన్ను వసూళ్లలో ఆర్ఐ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది

పురపాలక సంఘంలో 16,618 ఆస్తి పన్ను అసెస్‌మెంట్లు, 11,137 నీటి పన్న అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటి దాకా ఆస్తి పన్ను డిమాండ్ రూ.5.17 కోట్లు కాగా, రూ.2.57 కోట్లు వసూలు చేశారు. నీటి పన్ను డిమాండ్ రూ.3.90 కోట్లు కాగా, కేవలం రూ.79.49 లక్షలు మాత్రమే వసూలు చేశారు. 48 శాతంతో ఆస్తి పన్ను వసూలు ఫర్వలేదనిపిస్తున్నా, 19.82 శాతం వసూళ్లతో తాగునీటి కొళాయి పన్ను బకాయి పెద్ద ఎత్తున పేరుకుపోయింది.

### సకాలంలో పన్ను చెల్లించండి



వందశాతం పన్ను వసూలు చేసేందుకు కృషి చేస్తున్నాం. బకాయిదారులు సకాలంలో పన్ను చెల్లించి, అభివృద్ధికి సహకరించాలి. మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేస్తాం. అప్పటికీ స్పందించని పక్షంలో ఇంటి కొళాయి కనెక్షన్‌ను కట్ చేస్తాం. పట్టణంలో బిల్ కలెక్టర్, సచివాలయల సిబ్బంది స్పెషల్ డ్రైవ్ చేస్తూ, పన్నులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ శాఖల పన్ను వసూళ్లకు నోటీసులు జారీ చేస్తాం.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

### సరిహద్దులో చెక్‌పోస్టుల ఏర్పాటు



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఆర్డీవో వసంతబాబు

**బొమ్మనహాళ్:** మండలంలో అక్రమంగా ఇసుక కర్ణాటకకు తరలిపోకుండా సరిహద్దులో చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీఓ వసంతబాబు తెలిపారు. శనివారం బొమ్మనహాళ్ సరిహద్దులోని చెక్‌పోస్టును తహసీల్దార్ మునివేలుతో కలిసి ఆయన పరిశీలించారు. మండలంలోని వేదావతి హగరి నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలోని బొల్లనగుడ్డం, సిద్దరాంపురం, బొమ్మనహాళ్ శివారులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, వీఆర్ఓ, వీఆర్ఏలను విధులు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టామని ఆర్డీఓ తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలించినా, చెరువు, వాగుల్లో ఇసుక తవ్వినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### వాల్మీకి గ్రామ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం



పోస్టర్లను విడుదల చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

**బొమ్మనహాళ్:** ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం (ఏపీవీబీఎస్) గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ రాజన్న తెలిపారు. శనివారం నేమకల్లు గ్రామంలోని ప్రసిద్ధి చెందిన ఆంజినేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోయ సంఘం గ్రామ కమిటీలు ఏర్పాటు అనే పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు హరేసముద్రం దివాకర్, జిల్లా సెక్రెటరీ బడిగే వన్నూరుస్వామి, బొమ్మనహాళ్ మండల అధ్యక్షుడు కేపీ వన్నూరుస్వామి, వాల్మీకి సంఘం నాయకులు వన్నల్లి రామాంజనేయులు, కందేపల్లి రమేష్, నీరగంటి శ్రీనివాసులు, హరేసముద్రం తిప్పేస్వామి, ఉద్దేహాళ్ వన్నూరుస్వామి, రామకృష్ణ,రామాంజనేయులు, శీనప్ప, రమేష్, రామృష్ణ పాల్గొన్నారు.

### వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేయాలి

**రాయదుర్గంటౌన్:** వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేయాలని, దొడ్డిదారిన అమలు చేయాలని కేంద్రం ప్రయత్నిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ విమర్శించారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో స్థానిక సీపీఐ నేతలతో కలిసి మాట్లాడారు. ఢిల్లీ సరిహద్దుల్లో పోరాటం చేస్తూ 40 రోజులుగా దీక్షకు కూర్చొన్న జగదీష్ ఆరోగ్యం క్షీణిస్తున్నా కేంద్రానికి పట్టలేదన్నారు. పట్టణంలోని ఈ నెల 6, 7 తేదీల్లో జరిగే ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జాఫర్ పిలుపునిచ్చారు. వాల్మీకినగర్‌లో ఉండే బొంత డేరల్లో ఉండే బేడబుడగ జంగం ప్రజల జీవన విధానాన్ని పరిశీలించారు. వారికి తగిన సదుపాయాలు కల్పించాలని జాఫర్ కోరారు. సమావేశంలో సీపీఐ రాయదుర్గం ఇన్‌చార్జ్ నాగార్జున, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్, స్థానిక ఏఐవైఎఫ్ నాయకులు కొట్రేష్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

### వాహనాల తనిఖీ

**వజ్రకరూరు:** స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం సాయంత్రం ఎస్ఐ నాగస్వామి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఉరవకొండ – గుంతకల్లు ప్రధాన రహదారిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలకు జరిమానా విధించారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేయండి





మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై. విశ్వేశ్వరరెడ్డి, సమావేశానికి హాజరైన ముఖ్యనేతలు

- ఉరవకొండ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి

**ఉరవకొండ:** నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి జడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి, పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బెస్త రమణ హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకుందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక చేతులేత్తేసిందన్నారు.

**కేశవ్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి..**

వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులను ప్రలోభాలకు గురిచేసి టీడీపీలోకి చేర్చుకుంటున్నారని తెలిపారు. కేశవ్ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెడితే బాగుంటుందని, వైఎస్సార్‌సీపీ శ్రేణులను వేధింపులకు గురి చేసి వారిని పార్టీ మారేలా చేయడం సిగ్గుచేటని విశ్వ అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు నారాయణరెడ్డి, నరసింహులు, దేవిబాయి, కరణం పుష్పావతి, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, వైస్ ఎంపీపీలు దేవా, పుష్ప, వై.శ్రీనాథ్‌రెడ్డి, పంచాయతీరాజ్, ఎంపీటీసీలు ఈడిగ ప్రసాద్, అంగదాల ఆంజి, కురుబ ప్రకాష్, జోగి భీమ, భూమా కమలమ్మ, ఈశ్వర్, మచ్చన్న, బీసీసెల్ జిల్లా అధ్యక్షులు యోగేంద్ర రెడ్డి, దేవేంద్ర, భరత్‌రెడ్డి, సీపీవీరన్న, అశోక్, బసవరాజు, శివలింగ, ఓబన్న, గోవిందు, కరణంభీమిరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, త్రిలోక్‌రెడ్డి, బెళుగుప్ప శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### సెల్‌టవర్ ఏర్పాటుపై కాలనీవాసుల నిరసన



మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని 17వ వార్డు అజాద్ ఉర్దూ స్కూల్‌కు వెళ్లే దారిలో సామిల్ వద్ద సెల్ టవర్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కాలనీవాసులు శనివారం నిరసన తెలియజేశారు. కాలనీవాసులు శంకర్, షబ్బీర్, ఫని, నాగరాజు, శ్రీధర్, గురు, ఇబ్రహీం తదితరులు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. కాలనీవాసులు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకోవాలని, అంతే కాక సమీపంలోనే భవిత కేంద్రం, ఉర్దూ స్కూల్ ఉన్నట్లు చెప్పారు. అధికారులు అనుమతులు ఇవ్వరాదని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

## సంక్షిప్త సమాచారం

**ముగిసిన రెవెన్యూ సదస్సులు**

**కూడేరు:** మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు శనివారం ముగిశాయి. చివరి రోజు చోళసముద్రంలో అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ, ఇతర సమస్యలపై ప్రజలు, రైతుల నుంచి 23 అర్జీలు వచ్చాయి. మండల సర్వేయర్ అయేషా సిద్దిఖీ స్వీకరించారు. వీఆర్వోలు గోపాల్, లింగారెడ్డి, శంకర నారాయణ పాల్గొన్నారు.

**బాల్య వివాహాలను బాధ్యతగా అడ్డుకోవాలి**

**వజ్రకరూరు:** బాల్య వివాహాలను బాధ్యతగా అడ్డుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి సూచించారు. శనివారం కొనకొండ్లలోని గ్రామ సచివాలయం (3) పరిధిలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమం ఏర్పాటు చేశారు.అంగన్‌వాడీ కార్యకర్తలు ఈరమ్మ, జయలక్ష్మి, సువర్ణమ్మ, మహిళా పోలీస్ రాజ్యలక్ష్మి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

**పందికుంటలో బాల్య ఆరంభ విద్య ప్రారంభం**

పందికుంటలో బాల్య ఆరంభ విద్య కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు.ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హెచ్.పద్మా ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెల్త్‌ఎడ్యుకేటర్ సత్యనారాయణ,హెల్త్ అసిస్టెంట్ గణేనాయక్, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, సునిత, ఆయాలు మీనాక్షి, రాజ్యలక్ష్మి, ఆశా కార్యకర్త చౌడమ్మ, జయలక్ష్మి, మోతీబాయి పాల్గొన్నారు.

**కిశోరి వికాసంపై శిక్షణ**

**బ్రహ్మసముద్రం :** మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో కిశోరి వికాసంతోపై శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణదుర్గం ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న అధ్యక్షతన కార్యక్రమం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ బాలికలను 11 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వరకు బాలికలు చదువుపై దృష్టి పెట్టేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుమతి, ఎంపీడీఓ నందకిశోర్, మెడికల్ ఆఫీసర్ అబ్బాస్, ఎంఈఓ– 2 కృష్ణానాయక్, ఏఎస్ఐ తిమ్మరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ ఖాసీంబీ, రామాంజినమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు రామలక్ష్మమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మహిళా కిసాన్ సంఘాల ఏర్పాటుపై సమీక్ష**

**వజ్రకరూరు:** స్థానిక స్త్రీశక్తి భవనంలో శనివారం మహిళా కిసాన్ సంఘాల (ఫార్మర్స్ ప్రొడ్యూసర్ గ్రూపు)ల ఏర్పాటుపై సమీక్ష ఏర్పాటు చేశారు. సమావేశానికి లైవ్లీఉడ్స్ డీపీఎం గంగాధర్, ఏరియా కోఆర్డినేటర్ శివప్రసాద్ తదితరులు హాజరయ్యారు. అనంతరం ఏరియా కోఆర్డినేటర్ శివప్రసాద్ మాట్లాడుతూ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ సంఘాల స్థానంలో మహిళా కిసాన్ గ్రూపులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రుణాల రికవరీపైనా అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో లైవ్లీఉడ్స్ డీపీఎం గంగాధర్, ఏరియా కోఆర్డినేటర్ శివప్రసాద్, జిల్లా ఏపీఎం రియాజ్, ఏపీఎం లలిత, సీసీలు, అకౌంటెట్లు, వీఓ సంఘాల లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

**శోభాయమానం.. శ్రీవారి పుష్పయాగం**

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని కోటలో వెలసిన కలియుగ దైవం ప్రసన్న వేంటకరమణస్వామి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శనివారం పుష్పయాగం నిర్వహించారు. అర్చకులు బాల మురళీకృష్ణ ఆధ్వర్యంలో సతీసమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలకు పుష్పాలంకరణ చేసి, పూజలు చేశారు. అంతకుముందు ప్రాతఃకాలంలో స్వామికి తిరుప్పావై సేవ, పంచామృతాభిషేకం, అభిషేకాలు, కుంకుమార్చన, నైవేద్యం, పుష్పార్చన, ప్రసాద వినియోగం జరిగాయి. ఈ నెల 10న వైకుంఠ ఏకాదశి, 13న గోదాదేవి కల్యాణోత్సవం జరుగుతుందని దేవదాయశాఖ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

**ఇల్లు దగ్ధం**

**బెళుగుప్ప:** అంకంపల్లిలో కటువప్పకు చెందిన ఇల్లు శనివారం షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయింది. ఇంట్లోని ఫ్రిడ్జ్, టీవీ, ఐదు ప్యాకెట్ల బియ్యం, దుస్తులు, వంట సామగ్రి కాలిపోయాయి. వెంటనే గుర్తించడంతో సురక్షితంగా బయటపడినట్లు బాధితుడు తెలిపారు.

**31 వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు**

**కళ్యాణదుర్గం:** మున్సిపాలిటీ పరిధిలోని కమ్మాన్ చెట్ల వీధి, న్యూ ఎస్సీ కాలనీ సచివాలయాల్లో ఈనెల 31 వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్ నమోదు, కొత్త ఆధార్ కొరకు (0–6 ఏళ్ల లోపు చిన్నారులకు), అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం కల్పించామన్నారు.

**ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు**

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని ప్రధార రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్ ఆక్రమణలపై పోలీసులు, మున్సిపల్ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఆక్రమణలు తొలగించుకోవాలని వారంరోజుల క్రితమే మున్సిపల్ అధికారులకు ఫుట్‌పాత్ వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. కానీ వ్యాపారులు పట్టించుకోకపోవడంతో సీఐ జయానాయక్ ఆధ్వర్యంలో శనివారం చర్యలు చేపట్టారు. రోడ్డు, ఫుట్‌పాత్‌లపై ఎవరైనా వ్యాపారాలు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

### రికార్డులు పక్కాగా నిర్వహించాలి : జెడ్పీ సీఈఓ



ఆలూరు వద్ద శ్రీరామరెడ్డి తాగునీటి సిస్టమ్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి

**గుమ్మఘట్ట:** రికార్డులు పక్కాగా నిర్వహించాలని జిల్లా పరిషత్ సీఈఓ రామచంద్రారెడ్డి సూచించారు. శనివారం మండలంలోని రంగసముద్రం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకాన్ని పరిశీలించి, తాగునీటి సరఫరాపై ఆయన ఆరా తీశారు. ఎంపీడీఓ రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**కణేకల్లు:** మండలంలో శ్రీరామరెడ్డి తాగునీటి పథకాన్ని జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి శనివారం పరిశీలించారు. ఆలూరు వద్ద ఉన్న శ్రీరామరెడ్డి తాగునీటి పథకం పంప్‌హౌస్, ఇంటెక్ వెల్‌ను పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శివకృష్ణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం యర్రగుంట పీహెచ్‌సీలో ఉన్న ఓహెచ్‌ఎస్ఆర్‌ను సందర్శించారు. గ్రామంలో తాగునీటి సమస్య గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పి.శ్రీనివాసులు, ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు, ఏఓ చిక్కణ్ణ తదితరులు పాల్గొన్నారు.

### ‘పది’లో మంచి ఫలితాలు సాధించాలి



పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేస్తున్న దృశ్యం

**కంబదూరు:** పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని హెచ్ఎం పరమేశ్వరప్ప, యూటీఎఫ్ జిల్లా కన్వీనర్ చిత్తప్ప సూచించారు. శనివారం మండలంలోని ములకనూరు జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ పదోతరగతి పబ్లిక్ మోడల్ పరీక్ష ప్రశ్న పత్రాలను ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్ విద్యార్థులకు శనివారం వితరణ చేశారు.

### ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ బదిలీ

సాక్షి ఎఫెక్ట్..

**శెట్టూరు:** మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ మహబూబ్‌బాషాను బదిలీ చేశారు. గత నెల 30న ‘సాక్షి’లో ‘మాకొద్దు ఈ భోజనం’ శీర్షికన వార్త ప్రచురితమైంది. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ శనివారం స్పందించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్ ఎస్. మహబూబ్ బాషాను గుత్తి కాలేజ్ హాస్టల్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. అనంతరం కళ్యాణదుర్గంలో వార్డెన్ పి.సురాంజినేయులును శెట్టూరు ఎస్సీ వసతిగృహ వార్డెన్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. వార్డెన్ మహబూబ్ బాషా నిర్లక్ష్యంపై పలుమార్లు ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ అతనిలో మార్పు రాలేదు. దీంతో జిల్లా కలెక్టర్ సీరియస్ అయ్యారు. బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

### కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

**రాయదుర్గంటౌన్/కళ్యాణదుర్గంరూరల్/కంబదూరు/బొమ్మనహాళ్/కుందుర్పి/ కణేకల్లు:** రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్ గౌని లావణ్య, ప్రిన్సిపాళ్లు విజయలక్ష్మి, విజయభాస్కర్, ఎంఈఓలు నాగమణి, వెంకట రమేష్ పాల్గొన్నారు. కళ్యాణదుర్గంలోతహసీల్దార్ భాస్కర్, ఎంఈఓ–2 బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.బొమ్మనహాళ్‌లో ఎంఈఓ మల్లికార్జున, ప్రిన్సిపాల్ మోహన్ కుమార్, హెచ్ఎం రాజ్‌కుమార్ , డాక్టర్ శ్రీలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శీనునాయక్, అధ్యాపకు లు సుబ్బ రాయుడు, నాయకులు కొత్తపల్లి మల్లికార్జున, కొత్తపల్లి మహేంద్ర, పయ్యావుల అనిల్, లాలుస్వామి పాల్గొన్నారు. కుందుర్పిలో ఎమ్మెల్యే సురేంద్రబాబు, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, ఎంఈఓలు తిప్పేస్వామి, ఓబుళపతి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు. కంబదూరులో నాయకులు రామ్మోహన్‌చౌదరి, శ్రీరాములు, దండా వెంకటేశులు, సురేంద్ర, తలారి ఎర్రిస్వామి, ప్రిన్సిపాల్ శ్రీవల్లి పాల్గొన్నారు. కణేకల్లులో తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ఎంఈఓలు లక్ష్మణ్ణ, భవానీ శంకర్, లెక్చరర్లు పి.రమేష్, అన్వర్‌బాషా, రామాంజనేయులు, మాజీ ఉప సర్పంచు ఆనంద్ రాజ్, టీడీపీ నాయకులు రమేష్, చాంద్ బాషా, అనిల్‌చౌదరి పాల్గొన్నారు.